క్లుప్తంగా

ఐఈఆర్‌పీ నియామకం

మాకవరపాలెం: భవిత కేంద్రానికి ఐఈఆర్ పీగా విజయ్‌కుమార్ నియామకమయ్యారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి ఇప్పటివరకు ఒక్కరే ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పి) ఉన్నారు. ఈ నేపథ్యంలో మరో ఐఈఆర్‌పిగా విజయ్‌కుమార్‌ను నియమించడంతో శనివారం విధుల్లో చేరారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించండి



అర్లలో ప్రకృతి సిబ్బందితో అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి చిరంజీవి

రోలుగుంట : ప్రకృతి సేద్యంపై అవగాహన పెంపొందించుకొని తద్వారా పంట దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి చదువుల చిరంజీవి అన్నారు. మండలం శరభవరం పంచాయతీ శివారు అర్ల గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, పలు రకాల కాషాయాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, శ్రావణి రైతులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయడం జరుగుతుందని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. కుక్కలను పెంచే వారు ప్రతి ఏటా జులై 6న తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ఇంట్లో చిన్నపిల్లలు ఉన్న దగ్గర చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుక్కల నోట్లో చిన్నపిల్లలు చేతులు పెట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. కుక్కలు కరిచిన వెంటనే మంచినీటితో సబ్బుపెట్టి శుభ్రంగా కడగాలన్నారు. తరువాత దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి టీకాలను వేయించాలన్నారు. అలా చేయని పక్షంలో కుక్క కరిచిన మనిషి పిచ్చి కుక్కలా అరుస్తూ నోటిలో నుంచి చొంగ వస్తూ చనిపోతారన్నారు. ప్రత్యేక శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీకాలు వేస్తామన్నారు.

మండల సర్వేయర్‌గా శ్రీనివాస్



రావికమతం : మండల సర్వేయర్‌గా సీహెచ్. శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోటవురట్ల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సర్వేయర్ సురేష్ చీడికాడ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ నా పరిధిలోని వచ్చిన సమస్యలు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

మురుగునీటితో సావాసం



గొట్లాంలో నూకాంబిక ఆలయ వెనుక వీధిలో నిలిచిన వర్షపునీరు

కె.కోటపాడు : గొట్లాం గ్రామంలో గల నూకాంబిక అమ్మవారి ఆలయ వెనుక భాగంలో గల వీధిలో ఇటీవల వర్షాలకు నీరు నిల్వ ఉండిపోయింది. రోజుల కొలదీ నీరు నిల్వ ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలో డ్రైయినేజీ కాలువల నిర్మాణం లేకపోవడం కారణంగా ప్రజలు ఉపయోగించే వాడుకనీరు, వర్షపునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక నివాసాల నడుమ రోడ్డుపైనే నిలిచిపోతున్నది. ప్రభుత్వం వెంటనేనిధులను మంజూరు చేసి డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి అవతారంలో జగన్నాథస్వామి



చోడవరం : జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా శనివారం కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి అవతారంలో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. చోడవరం కేశవస్వామి ఆలయంలో వేంచేసి యున్న బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అడుగుపెట్టాలంటే హడల్..!



ప్రస్తుత వర్షాలకు ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన నీరు



రన్నింగ్ ట్రాక్ బురదగా ఉండటంతో గట్టుపై నుంచి స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

- అధ్వానంగా ఉన్నత పాఠశాల ఆవరణ
- తరగతి గదులు సైతం బురదమయం
- రూ.5 లక్షలతో ఇటీవల అభివృద్ధి
- మరింత చిత్తడిగా ఆవరణ
- నిత్యం ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

మాకవరపాలెం : చినుకు పడితే ఉన్నత పాఠశాల ఆవరణ అధ్వానంగా మారుతోంది. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకుంది. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా నిత్యం తరగతి గదుల్లోకి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పాఠశాల ముందున్న ఖాళీ స్థలమంతా ప్రస్తుతం కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఏమాత్రం వర్షం కురిసినా ఈ మైదానమంతా బురదమయంగా మారుతోంది.

రూ.5 లక్షలతో మరమ్మతులు..

ఈ ఆవరణకు మరమ్మతులు చేయడం, రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్, వాలీ బాల్ కోర్టుల నిర్మాణాలకు ఆరు నెలల క్రితం రూ.5 లక్షలు మంజూరు చేసి, పనులు చేపట్టారు. ఇప్పటివరకు రూ.4.25 లక్షలు ఖర్చు చేయగా దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. కానీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రన్నింగ్ ట్రాక్‌తో పాటు ఆవరణ అంతా బురదమయంగా మారింది. ఇక రన్నింగ్ ట్రాక్‌పై నడిస్తే జారిపడేలా చిత్తడిగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఇటుకలతో నిర్మించిన గట్లపై నుంచి అతి కష్టంమీద పాఠశాలకు వస్తున్నారు. తొమ్మిదేళ్ల క్రితం కూడా ఇదే ఆవరణలో రన్నింగ్ ట్రాక్, వాలీ బాల్, ఫుట్‌బాల్ ట్రాక్‌లు, ఆవరణ ఎత్తు చేసేందుకు రూ.12 లక్షలు ఖర్చు చేశారు.

తూతూమంత్రంగా ఆవరణ అభివృద్ధి..

ఈ పాఠశాల ఆవరణ అభివృద్ధి పనులను తూతూ మంత్రంగానే చేపట్టారు. ఈ పనుల్లో నిబంధనలు పాటించకపోవడంతో వర్షాలకు ఆవరణ అంతా చిత్తడిగా మారింది. రన్నింగ్ ట్రాక్‌ను రోలర్‌తో రోలింగ్ చేయాల్సి ఉన్నా చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు విద్యార్థులు తరగతి గదుల్లోకి వచ్చి తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆవరణ అంతా బురదతో నిండి ఉండడంతో అడుగుతీసి అడుగు వేసేందుకు కూడా వీలు లేకుండా మారింది. వర్షాల కారణంగా నిత్యం పలువురు విద్యార్థులు బురదలో పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేసే సమయంలో పర్యవేక్షణ లేకపోవడంతో ఎన్ని లక్షలు వెచ్చించినా సమస్య పరిష్కారం కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఈ ఆవరణ ఇలా ఉండడంతో విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారు.

మరమ్మతులకు చర్యలు

పాఠశాల ఆవరణకు మరమ్మతులు చేపడతాం. ఈ వర్షాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు తగ్గగానే బురద లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– డి.నారాయణరావు, పాఠశాల హెచ్‌ఎం

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నర్సీపట్నం : పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఈ సర్దుబాటు ఛార్జీల పేరుతో మొత్తం రూ.15485 కోట్ల భారాన్ని సామాన్య ప్రజానీకంపై మోపిందన్నారు. ఈ భారం రాబోయే 25 ఏళ్లకు రూ.లక్షా పదివేల కోట్లు భారం పడుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లు బిగించే కార్యక్రమాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లు గురుబాబు, ఎం.లక్ష్మి, జి.రాధాకృష్ణ, అర్జునరావు, మేకా భాస్కరరావు, భవాని, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ అప్పన్నదొర, రైతు సంఘం జిల్లా నాయకులు పులగం రమణాజీ, మర్రి అప్పలనాయుడు, ప్రజానాట్యమండలి నాయకులు శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల తాత్కాలిక భవనాలకు నిధులు



ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక భవనాలు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ జిల్లా అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్.శాస్త్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ నిధుల నుంచి రూ.కోటి నిధులు డిగ్రీ కళాశాల పక్కా భవనాల కోసం మంజూరు చేస్తారని పేర్కొన్నారు. కళాశాలలో 83 మంది విద్యార్థులకు రూ.2,23,567 స్కాలర్‌షిప్ చెక్కులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందితో పాటు స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, స్థానిక నాయకులు పుప్పాల రమేష్, రంజిత్‌వర్మ, లెక్కల కాశీబాబు, సూర్యనారాయణ వర్మ, నందారపు సన్యాసిరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయండి



వడ్డాది ఏఈ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన కార్మిక సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : అధిక విద్యుత్ బిల్లులతో పేద ప్రజల నడ్డి విరుస్తున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం నిలిపివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఐ నాయకులు, పలు కార్మిక సంఘ నాయకులు నిరసనకు దిగారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఇంట్లో ఒక బల్బు, ఫ్యాన్, చిన్న టీవీ ఉన్న పలువురు నిరుపేదలకు కూడా రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఆదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని ఆందోళన చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ రాజుకు వినతి పత్రం అందించారు. కార్మిక సంఘ నాయకులు రావాడ వరహాలు, వర సూరిబాబు, ముత్యాలు, రావాడ నాయుడు, ఎర్రి నాయుడు పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

మాకవరపాలెం : మండలంలోని వజ్రగడలో నిర్వహించిన వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ఇటీవల స్థానికులు జ్వరాలతో బాధపడంతో శనివారం మాకవరపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 70 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 8 మందికి జ్వరాలు ఉండడంతో రక్త పూతలు సేకరించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి పరిశీలించారు. గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వనీరు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరావు, సిహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డీ పట్టా రైతులకూ అన్నదాత సుఖీభవ అందించాలి



నిరసన తెలియజేస్తున్న రైతులు

రావికమతం : డీ పట్టా భూములు కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు చేయాలని గర్నికం గ్రామానికి చెందిన రైతులు శనివారం డిమాండ్ చేశారు. మండలంలో గర్నికం రెవెన్యూ పరిధిలో 16 దళిత కుటుంబాలకు 20 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, ఆ భూముల్లో మామిడి తోటలు వేసి సాగు చేసుకుని జీవిస్తున్నామని రైతులు తెలిపారు. అయితే రీ సర్వేలో ఈ భూములను డీ పట్టా భూములుగా తొలగించి ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతో వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేర్ల తొలగిపోయాయని, దీనిపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైతు భరోసా వచ్చేది, కానీ అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో పేర్లు లేవని, తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములను పరిశీలించి రికార్డులు సరిచేయాలని రైతులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులతో పాటు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట కమిటీ మండల కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొలకశాతం



ఇళ్ల వద్ద తడిగుడ్డలో కట్టుకున్న మొలకెత్తిన వరి విత్తనాలు

రోలుగుంట : ఖరీఫ్ సాగు కోసం మండలంలో 24 పంచాయతీల పరిధిలో వరి విత్తనాల నమోదు పూర్తి చేసి విత్తనాలు పంపిణీ జరిగింది. సాగు కోసం సిద్ధం చేసుకున్న నారుమడుల్లో ఆకుపోత పనుల కోసం రైతులు దుక్కులు చేసుకున్నారు. రాయితీపై ప్రభుత్వం ఇచ్చిన 100 గింజలు తడిగుడ్డలో నానబెట్టి మొలకశాతం పరీక్ష చేసుకోగా రెండు రోజుల తరువాత మొలకశాతం 90 శాతం ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. ఆకుపోత పనులకు భూముల్లో తడులు అనుకూలంగా ఉన్నా, దమ్ములు చేసేందుకు, నాట్లకు అవసరమైన వర్షాలు ఇంకా పడాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 1850 హెక్టార్లు కాగా, రైతులు కోరిన అన్ని రకాల విత్తనాలను సుమారు 740 క్వింటాళ్లు పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. తమశాఖ పరంగా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తున్నట్టు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 784 కేసుల పరిష్కారం



అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు షీయాజ్ ఖాన్, శ్రీభరణి

నర్సీపట్నం : లోక్ అదాలత్‌లో వివిధ రకాలకు సంబంధించిన 784 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో సామరస్య పూర్వక వాతావరణంలో కేసులను పరిష్కరించుకునేందుకు అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యారు. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్‌ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీ భరణి కేసులను పరిష్కరించారు. అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పులతో సమానమని సీనియర్ సివిల్ జడ్జి పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరు వర్గాలకు భేదాభిప్రాయాలు ఉండవన్నారు.

మెనూ చార్జీలు, జీతాలు చెల్లించాలి



ఎ.కోడూరులో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న నాయుడుబాబు

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జీతాలతో పాటు మెనూ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు అన్నారు. కె.కోటపాడు, ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకొని మెనూ చార్జీల ధరలను పెంచాలని ఆయన కోరారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, రైతులు, వివిధ వర్గాల వారి సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని నాయుడుబాబు కోరారు.

రోగులందరికీ వైద్య సేవలు అందేలా చూడండి



బుచ్చెయ్యపేటలో మందులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి హైమావతి

బుచ్చెయ్యపేట : రోగులందరికీ సకాలంలో వైద్య సేవల సక్రమంగా అందేలా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్యాధికారి ఎం.హైమావతి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను, ప్రతి రోజు ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య అందిస్తున్న మందులు, ల్యాబ్ పరీక్షలు, వైద్య సేవల రికార్డులను తనిఖీ చేశారు. మందుల గదిలోకి వెళ్లి అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నవి లేనివీ పరిశీలించారు. రోగుల పట్ల చిరాకు పడకుండా వారికి ఉన్న అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని తగిన వైద్యం అందేలా చూడాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులన్నింటిని అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులు కె.రమేష్, ఫార్మాసిస్టు పుణ్యవతికి సూచించారు. సీహెచ్‌ఓ దేముడు, హెల్త్ సూపర్‌వైజర్ మామిడి రామకృష్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ కమిటీ నియామకం

దేవరాపల్లి : పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల కమిటీని నియమించారు. మండల వైస్ ప్రెసిడెంట్లుగా చల్లా నాయుడు, బండారు దేముడునాయుడు, జనరల్ సెక్రటరీలుగా గూడెపు రాము, ఆర్.వి.కె.నాయుడు, చింతల బుల్లిలక్ష్మి, దొగ్గ అప్పలనాయుడు, కార్యదర్శులుగా వరదపు రెడ్డి పైడితల్లి, బండారు గోవిందరావు, దొమ్మంగి సన్యాసమ్మ, రావాడ అమ్మన్న, కె.ఎస్.అప్పలనాయుడులను నియమించారు. మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పోడెల వీరాంజనేయులు, రొంగలి సింహాచలంనాయుడు, యండపల్లి సాంబశివరావు, మజ్జి రాజు, నాగిరెడ్డి చిట్టినాయుడు, కోన సత్యం, గూనూరు కొండబాబు, ఈర్లె అప్పలనాయుడు, డోకల ఎరుకునాయుడు, వంటాకు శ్రీను, పోతల రఘు వెంకట ప్రసాద్, దాడి జగన్నాథరావు, సలాది కొండలరావు, జూరెడ్డి గోవింద, వేచలపు చిన్నంనాయుడులను నియమించారు.

10న మెగా పేరెంట్స్ డే నిర్వహించాలి



ఎంఈవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి

చోడవరం : ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ డే కార్యక్రమం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి ఆదేశించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం సాయంత్రం ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ సహాయకులు, విద్యాశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెగా పేరెంట్స్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను వివరించారు. సమావేశంలో తహసీల్దారు రామారావు, ఎస్‌ఐ జోగారావు, ఎంఈవోలు లక్ష్మణరావు, సింహాచలం పాల్గొన్నారు.

విజన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: సచివాలయం ఉద్యోగులను సద్వినియోగం చేసుకుని పీ 4 సర్వే పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాణమూర్తి అన్నారు. స్థానిక పీఆర్ అతిథి గృహంలో శనివారం విజన్ యాక్షన్‌ప్లాన్‌పై నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సుగర్ ఫ్యాక్టరీ దెబ్బతినడంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి ఇన్వర్టర్ బహూకరణ

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం అన్నదాన సత్రానికి దాత సహకారంతో శనివారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. సత్యవరం గ్రామానికి వాసవీక్లబ్ సభ్యులు పుట్టా మోహన్‌రావు, కళావతి, సాయి, కుటుంబ సభ్యుల సహకారంతో ఇన్వర్టర్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడుకు అందజేశారు. మోహనరావు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం ఇన్వర్టర్‌ను అందజేసినట్టు మోహనరావు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



ఆటో జాతాను ప్రారంభిస్తున్న సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు



గోడ పత్రికను విడుదల చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి దొర తదితరులు

నర్సీపట్నం : ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను నర్సీపట్నంలో విజయవంతం చేయాలని సీపీఎం పిలుపునిచ్చిందన్నారు. ఆటో జాతాను శనివారం పట్టణ టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పది గంటల పని పెంపును ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్ మార్పును మానుకోవాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కళాసీ కార్మికులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో శనివారం దేశవ్యాప్త సమ్మె గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బి.టి.దొర మాట్లాడుతూ ఒక కుటుంబ జీవనానికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఏడాదికి ఒకసారి కార్మిక నాయకులతో చర్చించి జీతభత్యాలు ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలన్నారు. అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ యూనిట్



అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి దిశనిర్దేశం చేసేందుకు నియోజకవర్గ విజన్ కార్యాచరణపై స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అధికారులతో శనివారం తొలి సమావేశం నిర్వహించారు. స్పీకర్ చైర్మన్, వైస్‌చైర్మన్‌గా ఆర్డీవో రమణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో కాన్‌స్టెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను అధికారంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో విస్తతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రంగాలపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతకు తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించి వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఈ యూనిట్ ప్రధాన లక్ష్యమన్నారు.